

# మహారుద్రం



మహారుద్రం అనే ప్రక్రియ ఒక విశేషమైన లోక కళ్యాణ కారకమైన ఆయురారోగ్య కారకమైన క్రతు విశేషంగా చెప్పబడింది. ఈ మహారుద్ర కార్యక్రమములో 121 మంది సుశిక్షితులైన ఋత్విక్కులు పాల్గొని ఒక్కొక్కరు 11 ఆవృత్తులు రుద్రనమక, చమక పారాయణం చేస్తారు. దాంతో మొత్తం 1331 ఆవృత్తులు రుద్ర నమక, చమకాలు పారాయణ చేసినట్లు అవుతుంది. పారాయణతో పాటే అభిషేకం, అభిషేకంతో పాటే హోమంకూడా జరగటం ఈ మహారుద్రంలోని విశేషం. సాధారణంగా ఈ మహా రుద్రం చేయటానికి విశాలమైన యజ్ఞవాటికలు అవసరమవు తాయి. దేవాలయ పరిసరాలలో వున్న విశాలమయిన ప్రాంగణాలు ఈ మహారుద్రానికి అనువైన చోట్లు. ఋత్విక్కులను 11 గణాలుగా విభజించి ఒక్కొక్క గణంలోను 11 మంది ఋత్విక్కులు ఉండేలా ఏర్పాటు చేస్తారు. విశాలమయిన యజ్ఞవాటికలో ఒకవైపు హోమకుండం ఏర్పాటు చేసి మిగిలిన భాగంలో 11 గణాలుగా ఏర్పాటు చేస్తారు. వీటి పేర్లు వరుసగా 1. మహా దేవ గణం, 2.శివగణం, 3.రుద్రగణం, 4. శంకరగణం, 5. నీలలోహితగణం, 6. ఈశానగణం, 7. విజయగణం, 8. భీమగణం, 9. దేవదేవ గణం, 10. భవద్భవగణం, 11. ఆదిత్యాత్మక రుద్రగణం ఆదిత్యాత్మకరుద్రగణాన్ని మధ్యలో ఉంచి దాన్ని చుట్టూ మిగిలిన గణాలను ఏర్పాటు చేయటం ఆనవాయితీ. ఒక్కొక్క గణంలోనూ 11 కలశాలు ఉంటాయి. ఒక ప్రధాన కలశం, 10 చిన్న కలశాలు ఒక ఆవరణలో ప్రతిష్టించి జరీ వస్త్రాలతో అలంకారం చేయబడతాయి. ఒక్కొక్క గణం వద్ద 11 మంది ఋత్విక్కులు కూర్చుని రుద్ర జపపారాయణ చేస్తారు. ఈ రకంగా 11 గణాల వద్ద మొత్తం 121 మంది ఋత్విక్కులు ఉంటారు. వీరుగాక హోమకుండం వద్ద 11 మంది అభిషేకం చేసే శివ సన్నిధానంలో మరో 11మంది ఋత్విక్కులను ఎంపి యుంచుకుని ఈ మహారుద్రం మొదలు పెట్టడం జరుగుతుంది. యజ్ఞాల సాంప్రదాయంలో ఉద్గాత, హోతవిధిగా ఉంటారు. విఘ్నేశ్వరపూజ, గణపతి హోమంతో మొదలయ్యే ఈ కార్యక్రమంలో భాగంగా గోపూజ, గోదానం, చేయటం కూడా ఆనవాయితీగా వస్తోంది. మహన్యాసం చెప్పేముందుగా ఉదయ వత్తుల ఘోషతో వేదవాతావరణం, యజ్ఞవాటిక యావత్తూ వ్యాపిస్తుంది. ముందు చెప్పినట్లుగా మహన్యాస పూర్వకంగా అర్చన 11 గణాల వద్ద ఒకేసారి ఋత్విక్కులు చేయటం జరుగుతుంది. ఆ తరువాత 11 ఆవృత్తులు. రుద్రనమక, చమకాలు 121 మంది ప్రధాన ఋత్వికులు చేయడంతో 1331 సార్లు రుద్రం చేయటం అవుతుంది. ఒక పక్క శివాలయంలో అభిషేకం జరుగుతూ ఉంటుంది. మరోవంక హోమ గుండంలో హోమకార్యక్రమం జరుగుతూ ఉంటుంది. ప్రతి ఆవృత్తి తరువాత అన్ని గణాల వద్ద కూడా ధూపదీప నైవేద్యాలు చేయటం జరుగుతుంది. రుద్ర పారాయణ ఆవృత్తులు పూర్తయిన తరువాత అష్టోత్తర శతనామ అర్చన, ఆ తరువాత పూర్ణాహుతి.

ఓం.. "పూర్ణమిదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే"

"పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణామేవవిశ్యతే. అనే అమోఘవేదమంత్రాల నడుమ సర్వం జహోతి అంటూ చేసే" ఈ పూర్ణాహుతితో హోమం పూర్తవుతుంది. అవాహన చేయ బడిన... కలశాలోని జలాన్ని శివునికి అభిషేకం చేయటం... తరువాత కార్యక్రమం మంత్రపూర్వ జలంతో శివుని అభిషేకం చేయటం పూర్తయ్యాక శాంతి మంత్రాలతో సమస్త దేవతలకు స్వస్తివలికి యధాస్థానముద్వాసయామి అని చెప్పిన తరువాత తిరిగి నిత్యపూజచేసి ఆ తరువాత ఋత్విక్కులకు, క్రతు నిర్వాహకులకు భోజనాదికాలు ఏర్పాటు చేయటం ఒక సంప్రదాయం. భోజనాంతరం బ్రాహ్మణాశీర్వాద మంత్రాలతో ఈ మహారుద్ర కార్యక్రమం పూర్తవుతుంది. ఎంతో మహిమాన్విత మయిన ఈ కార్యక్రమంలో భాగం పంచుకున్న భక్తులు వారి వారి మనోరథాలు నెరవేరి ఆ పరమేశ్వర అనుగ్రహానికి పాత్రులవుతారు. రోజుల పాటు సాగే మహారుద్ర కార్యక్రమాన్ని అతిరుద్రం అనిపిలుస్తారు. దేశంలో క్షామనివారణకు నీటి కరువును ఎదుర్కొనే సమయంలోనూ ఈ అతిరుద్రం ఎంతో ప్రయోజనాకారిగా ఉంటుందని వేద విదులు చెప్పడం జరిగింది.

- డాక్టర్ ప్రతాప దక్షిణామూర్తి దీక్షితుల

## నరసింహరూప నారాయణునికి నమోనమః



వైశాఖ శుద్ధ చతుర్దశి నాడు శ్రీనరసింహస్వామి వారి జయంతి. స్వామివారు వైశాఖ మాసశుక్ల పక్షంలో పౌర్ణిమ ముందు వచ్చే చతుర్దశినాడు ఉభయ సంధ్యలకు నడుమ అనగా సాయంకాల సంధ్య కాలంలో ఇటు పగలు అటు రాత్రి కానివేళ ఇటు నరుడు అటు జంతువుకాని రూపంలో అటు భూమి ఇటు ఆకాశం కాని, తన తొడలపై హిరణ్యకశిపుని పొట్టను చీల్చి ప్రేగులు మెడలో వేసుకుని ప్రళయగర్జనలు చేస్తూ భీన భీంత రాళాలు దద్దరిల్లినట్లుగా సింహనాదం చేస్తూ మధ్యాహ్న సూర్యునివలె అవిర్భవించాడు శ్రీ నరసింహమూర్తి.

ఈ రోజు బ్రహ్మముహూర్తంలో లేచి తలస్నానం చేసి శ్రీ స్వామివారిని కొబ్బరి నీళ్ళతో, తేనెతో, ఆవుపాలతో శ్రీ సూక్త, పురుష సూక్త సమన్వితంగ అభిషేకించి శ్రీ నరసింహ సహస్ర నామస్తోత్రం చేయాలి. స్వామి వారికి పానకం వడపప్పు నివేదన చేయ్యాలి. శ్రీ చందనంతో స్వామివారిని పూర్తిగా అలదిశీతలో పచారముల చేసి పుష్పాంజలి సమర్పించి కర్పూర హారతి ఇవ్వాలి. ఆ రోజు ఉపవాసము చెయ్యాలి.